తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు బాధ్యతగా పనిచేయాలి

## రానున్న సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిద్దాం : జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీ షా



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : రానున్న సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో అన్ని విభాగాలు కలిసి సమన్వయంతో ఎన్నికల విధులను నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీ షా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎస్పి పరమేశ్వర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అధితి సింగ్, డిఆర్ఓ పెంచలకిషోర్, ఎన్నికల విధులు కేటాయించిన శాఖాధికారులతో ఎన్నికల సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ప్రణాళికబద్ధంగా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను, నిబంధనల మేరకు ఎన్నికల నిర్వహణ సమయంలో ఎటువంటి అవాంతరాలు కలుగకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం, అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచి ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని తెలిపారు. బారు, రెస్టారెంట్‌లో ఎక్కువ అమ్మకాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి వెంకట్రావు, అసిస్టెంట్ కమిషనర్ జిఎస్టి ఉమేష్ కుమార్, సెబి సూపరింటెండెంట్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ రమేష్, ఆర్వోలు కిరణ్ కుమార్, చంద్రముని, నిశాంత్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి, నరసింహులు, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు, డిఆర్‌డిఏ పిడి జ్యోతి, జిల్లా పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి శంకర్ నాయుడు, జిల్లా సూక్ష్మనీటి సేద్య అధికారి సతీష్ తదితరఉలు పాల్గొన్నారు.

### ఇతర కళాశాలల విద్యార్థులకు...

# టిటిడి విద్యార్థులు అదర్శం కావాలి



తిరుపతి,ఫిబ్రవరి 9ప్రభాతవార్త :టిటిడి కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి ఇతర కళాశాలల విద్యార్థులకు అదర్శంగా నిలవాలని టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి కోరారు. టిటిడి కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులందరూ ఎంతో అదృష్టవంతులని పేర్కొన్నారు. మహతి ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం "స్టూడెంట్స్ సక్సెస్‌మీట్-అఛీవర్ అవార్డుల" ప్రదానోత్సవం జరిగింది. అకడమిక్స్,ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ గేమ్స్, కరికులర్, కాంపిటీటివ్ ఎగ్జామ్స్, ప్లేస్‌మెంట్స్ తదితర అంవాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 215మంది విద్యార్థినీవిద్యార్థులకు 5గ్రాముల వెండిడాలర్, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఓ సదాభార్గవి, టిటిడి డిఇఓ డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి, టిటిడి ముఖ్యగణాంకాధికారి శేషశైలేంద్ర, ఎస్వీవేదవర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణిసదాశివమూర్తి, పిఆర్ఓ నీలిమ.పద్మావతి మహిళ డిగ్రీకళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ కృష్ణవేణి,కళాశాలల ప్రిన్సిపాళ్ళు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిత్తూరులో పెరుగుతున్న ఆశావహులు...!?

- జంగాలపల్లి సమాజిక వర్గ నేతల్లో టిక్కెట్‌పై ఆశలు - డికె ఆదికేశవులు కుమార్తె వైపు మొగ్గు చూపుతుందని ప్రచారం - అభ్యర్థిత్వం తనదేనని నమ్మకంగా గురజాల జగన్మోహన్‌నాయుడు

చిత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలలకు ముందే అధికార వైకాపా చిత్తూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీని నియమించి ఎన్నికలకు తాము ఎప్పుడైనా సిద్ధం అంటూ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి సవాల్ విసిరింది. మరోవైపు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తూరు నుండి పోటీ చేసే అభ్యర్థి ఎవరనే విషయంపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వకుండా నాన్చుడు వైఖరీ అవలంబిస్తోంది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఖరారుచేయపోవడంతో అభ్యర్థిత్వం కోసం పోటీ పడు తున్న నాయకులందరు చిత్తూరు నగర పరిధిలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్. రాజసింహులు ఆధ్వర్యంలో తెలుగుదేశం పిలుస్తోంది...! రా..! కదలిరా...! కార్యక్రమంను ముకుమ్మడిగా నిర్వహిస్తున్నారు. చిత్తూరు అసెంబ్లీ స్థానంలో ఎన్నికలకు సంబంధించి గత 20 సంవత్సరాలుగా రెడ్డి, బలిజ సామాజిక వర్గాల మధ్య పోటీ నెలకొంటోంది. ఈ ఎన్నికల్లో సైతం అధికార వైకాపా ఇప్పటికే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి పేరును ఖరారు చేయడంతో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ సైతం ఇక్కడి నుండి బలిజ సామాజిక వర్గానికి చెందినఅభ్యర్థిని తెరపైకి తీసుకు వస్తుందని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే బలిజ సామాజిక వర్గం నుండి మాజీ మేయర్ కఠారి హేమలత,జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కాజూరు బాలాజీలు చిత్తూరు 'దేశం' అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్నారు. వీరిద్దరిలో ఎవరికో ఒకరికి పార్టీ అధిష్టానం అభ్యర్థిత్వం ఖరారు చేస్తోందని ఇప్పటి వరకు అందరు భావించారు. అయితే ఇటీవల జిడినెల్లూరులో జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పాల్గొన్న తెలుగుదేశం పిలుస్తోంది...! రా...! కదలిరా...! కార్యక్రమంలో మాజీ టిటిడి ఛైర్మన్ దివంగత డికె ఆదికేశవులు కుమార్తె తేజస్వీని ఎంట్రీ ఇవ్వడంతో పార్టీ అధిష్ఠాం ఎన్నికల్లో ఆ కుటుంబం వైపు మొగ్గ చూపవచ్చుననే ప్రచారం ఊపందుకొంది. ఇక మరో సామాజిక వర్గం నుండి గురజాల జగన్మోహన్‌నాయుడు, చంద్రప్రకాష్‌లు పార్టీ అభ్యర్థిత్వం ఆశిస్తున్నారు. ఓ వైపు గురజాల జగన్మోహన్‌నాయుడు ఈ సారి చిత్తూరు పార్టీ అభ్యర్థిత్వం తనకే వస్తుందని ధీమాతో వున్నారు.అభ్యర్థిత్వం తనకే దక్కుతుందని భావిస్తున్న గురజాల ప్రజల మద్దతు పొందడానికి సేవా కార్యక్రమాలను విస్తృతం చేశారు. మరోవైపు చిత్తూరు రూరల్ మండలంలో తెలుగుదేశం పార్టీకి సర్వం తానై వ్యవహరిస్తూ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా, జడ్పీ ఛైర్మన్ పర్సన్ గిర్వాణీ భర్తగా చంద్రప్రకాష్ ఈ సారిపార్టీ అభ్యర్థిత్వంకోసం అలుపెరుగని పోరాటం సాగిస్తు న్నారు. ఎలాగైనా ఈ సారి ఎన్నికల్లో చిత్తూరు నుండి ఎమ్మెల్యే అయితే పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఇక్కడ సర్వం తానై వ్యవహరించవచ్చునని ఆయన భావిస్తున్నారు. మరోవైపు బిసీ కులాల నుండి చిత్తూరు నియోజకవర్గానికి ఏ మాత్రం సంబంధం లేని సిఆర్ రాజన్ చిత్తూరు తెలుగుదేశం అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. గత మూడు నెలలుగా చిత్తూరులో మకాం వేసిన ఆయన ఇప్పటికే తన కులస్తులతో ఒక సమావేశం నిర్వహించి పార్టీలకు అతీతంగా అందరు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఈ పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీఅధిష్టానంచిత్తూరు అసెంబ్లీ అభ్యర్థిత్వం ఎవరికి కేటాయించ దానికి సిద్ధం అవుతుందనే విషయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# సందిగ్ధంలో దేశం అభ్యర్థిత్వం...! తెలుగుదేశం సర్వే

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గం గురించి తెలుగు దేశం నాయకుడు నారాచంద్ర బాబునాయుడు మాట్లాడుతారనే ఫోన్లు శుక్రవారం సంచలనం సృష్టించాయి. తెలుగుదేశం పార్టీ గెలుపు అభ్యర్థులకు సంబందించి తమ పరిధిలో సర్వే నిర్వహి స్తున్నారు. పలుమార్లు ఆయన ఐవిఆర్ఎస్ సర్వే మేరకు గెలుపు అభ్యర్థులకే టిక్కెట్లు ఇస్తామని ప్రకటిస్తున్నారు.ఈ నేపథ్యంలో గత మూడు రోజులుగా శ్రీకాళహస్తికి సంబంధించి విస్తృత స్థాయిలో ఈ సర్వే నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో శుక్రవారం సర్వేకు సంబంధించి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి పేరును ప్రస్తావించారు. అభ్యర్థిత్వం ఎస్ అంటే ఒకటి నొక్కండి. కాదంటే 2నోటా నొక్కండి.అంటూ ఫోన్లు వచ్చాయి. గతంలో బొజ్జల బృందమ్మ, బొజ్జల సుధీర్‌రెడ్డిల పేరుతో సర్వే నిర్వహించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి తానే అంటూ సుధీర్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం చేపట్టారు. నియోజకవర్గంలో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అంతేకాక ఆయన సతీమణి రిషితారెడ్డి కూడా రేయింబవళ్ళు తేడా లేకుండా ప్రచారాల్లో ఉన్నారు.ఈ నేపథ్యంలో ఇక పార్టీ నుంచి సుధీర్‌రెడ్డికి గ్రీన్ సిగ్నల్ వచ్చిందేమో అని భావించారు. అయితే శుక్రవారం నాటి సర్వేతో పార్టీ వర్గాలు సందిగ్ధంలో పడ్డారు. ఇదేమి సుధీర్‌రెడ్డి ఏమో? తనకే టిక్కెట్టు ఖరారు అయ్యిందని చెబుతుంటే మళ్ళీ సర్వేలు ఎందుకు? అనే చర్చ మొదలైంది. అయితే ఈ సంఘటనపై సుధీర్‌రెడ్డి కూడా రాబిన్ శర్మ టీంపై శివమెత్తినట్లు పట్టణంలో చర్చించుకుంటున్నారు.అంతేకాక సుధీర్‌రెడ్డి పార్టీ రాష్ట్ర అధ్యక్షునితో కూడా పరుషంగా మాట్లాడినట్లు ప్రచారం మొదలైంది.సుధీర్‌రెడ్డి కొంత కాలం క్రితమే తాను ఈ నెల 9,10 న హైదరాబాదు వెళుతున్నట్లు పార్టీ వర్గాలకు చెప్పినట్లు చెబుతున్నారు. కానీ సర్వే శ్రీకాళహస్తిలో సంచలనం సృష్టించింది.పార్టీ అధిష్ఠానం సర్వేలతో కాలయాపన చేయక,పార్టీ అభ్యర్థి ఎవరో తేల్చితే రాబోవు ఎన్నికలకు సంబంధించి ప్రజల్లోకి వెళ్ళటానికి అనుకూలంగా ఉంటుందని పార్టీ సీనియర్లు చెబుతున్నారు.మరి ఏం జరుగుతుందో ఏమో?

**అలిగిన సుధీర్‌రెడ్డి?!**

సర్వేలతో సుధీర్‌రెడ్డిఅలిగి హైదరాబాదు వెళ్ళినట్లు ఓ ప్రచారం మొదలైంది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో హిచ్ కాక్ సస్పెన్స్‌లకు కొదవ లేదు.శుక్రవారం సర్వే నిర్వహించటం బొజ్జల రిషితారెడ్డి పేరుపై ప్రజాప్రాయం, పార్టీ వర్గాల అభిప్రాయాలనుపార్టీకోరటంతో సుధీర్‌రెడ్డి ఆగ్రహించారని చర్చించు కుంటున్నారు. అయితే ఇందులో వాస్తమెంతో తెలియదు కానీ సుధీర్‌రెడ్డి అలిగి వెళ్ళారని మాత్రం చర్చించు కుంటున్నారు. తెలుగుదేశం పార్టీకి ఈ ఎన్నికలు చావు బతుకు సమస్య.కాబట్టి పార్టీ గెలుపు అభ్యర్థులకు సంబంధించి స్క్రీనింగ్ చేస్తున్నారు.మరి సర్వేలో ఏం వస్తుందో ఏమో చూడాలి.మరి సర్వే ఇక్కడితో ఆగుతుందా? ఇంకెవరి పేరు మీదైనా సర్వే జరుగుతుందా? అని చర్చించుకుంటున్నారు.

# మజ్జిగ కాల్వ పోరంబోకు స్థలం కబ్జా

## -కబ్జాకు రెవెన్యూ అధికారులు, పోలీసులే సూత్రదారులు



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: తిరుపతి, తిరుపతిరూరల్ ప్రాంతాలలో ఖరీదు చేసే ప్రభుత్వ భూములు కనుమరుగు అవుతున్నాయి. ఖాళీ స్థలం కనబడితే కబ్జా చేసి, లక్షల రుపా యాలకు విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారు. తాజాగ ముత్యాలరెడ్డి పోలీసు స్టేషన్‌కు ఎదురుగా వున్నమజ్జిగ కాల్వను కబ్జాదారులు ఆక్రమించేసారు. తిరుపతి అర్బన్ సర్వేనెంబర్ 240లో వున్న మజ్జిగ కాలువలో ఖాళీగా 35సెంట్లు కాల్వపోరంబోకు స్థలం ఉంది. ఈ స్థలాన్ని భూ ఆక్రమణదారులు చదును చేస్తుం డగా స్థానిక బడుగు, బలహీన వర్గాల ప్రజలు అడ్డుకుని, అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసారు. అంతే కాకుండా కోట్ల రుపాయాలు విలువ చేసే ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని, ఇళ్ల లేని పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ముత్యాలరెడ్డిపల్లి పోలీసుస్టేషన్ ముందు నిరసన తెలిపారు. తిరుపతి అర్బన్ ఎస్పీ కార్యాలయానికి, తిరుపతి అర్బన్ తహశీల్ధార్ కార్యాలయాలకు కూతవేటు దూరంలో మజ్జిగ కాల్వ ఆక్రమణ జరుగుతున్న రెవెన్యూ అధికారులుపట్టించుకోకపోవడంతో సర్వత్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి.

# జన సంద్రం ...శివయ్య క్షేత్రం...!

## నాలుగువేల పూజలు - 20 వేల మంది దర్శనం



క్యూలైన్లలో నిరీక్షిస్తున్న శివభక్తులు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుని దర్శనం కోసం దేశ నలు మూలల నుంచే కాకుండా విదేశాల నుంచి భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు. శుక్రవారం అధికారులు అందించినసమాచారం మేరకు 20 వేలమంది దర్శనం చేసుకున్నట్లు అలాగే నాలుగువేల మంది రాహుకేతుదోష నివారణ పూజల్లో పాల్గొన్నారు. సాధారణంగా శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి శుక్రవారం నుంచి మంగళవారం వరకు కర్నాటక, తమిళనాడు భక్తులు విశేష సంఖ్యలో వస్తారు.అయితే శుక్రవారం తై అమావాస్య సందర్భంగా శ్రీకాళహస్తి కిట కిట లాడింది.అధికారులు అందించిన సమాచారం మేరకు రూ.200ల దర్శన టిక్కెట్లు 940,రూ.50ల దర్శనం టిక్కెట్లు 2000 అమ్ముడు పోయాయి. ఇక రాహుకేతుదోష నివారణ పూజలకు తండోపతండాలుగా భక్తులు కదలి వచ్చారు. 4వేలు రాహుకేతుదోష నివారణ పూజలుజరిపించుకున్నట్లు అధికారికంగా ప్రకటించారు.

**శివయ్యకు కానుకల పండగ:**

శివయ్యకు ఎనలేని కానుకల్ని అందిస్తున్నారు. అయితే ఇక్కడ దేవాలయం మీద ఆధారపడి జీవిస్తున్న వారు వచ్చిన భక్తుల్ని నిలువదోపిడికి గురి చేస్తూ భక్తిభా వంతో వచ్చిన వారు ఎందుకొచ్చామా? అని నొచ్చుకుంటున్నారు. ఇక ఇక్కడ పూజల్లో వచ్చిన సంభావనలను పంచుకోవటానికి పని చేస్తున్న వారు పడుతున్న గొడవలు పరిశీలకులను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఎప్పుడైనా శ్రీకాళహస్తీశ్వరాల యంలో ఇలా జరిగిందా? అని ముక్కున వేలేసుకుంటున్నారు.ఏదో ఒక రాజకీయ పార్టీ ముసుగుతో ఇక్కడ చేరుతున్న వారు విచ్చల విడిగా వ్యవహ రిస్తున్నారు.వారిని ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో అధికారులు కొట్టుమిట్టాడు తున్నారు. ఎవరిని బయటకు పోమ్మంటే ఏమౌతుందో అనే భావం అధికారుల్లో చోటు చేసుకుంది. గతంలో ఎన్నడూ లేనంత మంది దళారులు ఆలయంలో దర్శనమిస్తున్నారు.

### చంద్రబాబుకు అయ్యో అంటే...

# పదేళ్ల తిరోగమనం

మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి



పుంగనూరు సభలో మాట్లాడుతున్న మంత్రి

పుంగనూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : ప్రజలు చంద్రబాబునాయుడు పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, భ్రమపడి అయ్యోపాపం అంటే..మళ్ళీపదేళ్ళ ప్రగతివెనుక్కు వెడుతుందని.దీనివల్ల ప్రజలు, రాష్ట్రమూ తీవ్ర ఇబ్బందులుఎదుర్కొనకతప్పదని రాష్ట్ర అటవీ,విద్యుత్, శస్త్రసాంకే తిక, భూగర్భ వనరుల శాఖల మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నియోజక వర్గంలో పెద్దఎత్తున ఆసరా నిధులను మహిళలకు అందచేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. పుంగనూరు,చౌడేపల్లి, సోమల,సదుం, పులిచర్ల,రొంపిచర్ల,మున్సిపాలిటీ ప్రాంతాలలో మొత్తం 5661 సంఘాలకు చెందిన 50262 మంది మహిళలకు రూ.52.95 కోట్లను పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆయన పుంగనూరులో జరిగిన సభలలో మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలో నాలుగు విడతలలో రూ.213.70కోట్లను అందచేశా మన్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఆంధ్ర ప్రజలను, మహిళలను నిలువునా మోసంచేశారన్నారు. మహిళల రుణమాఫీ,రూ.14200కోట్లకు గానూ, రూ.25వేలకోట్ల వరకు పెరిగిందన్నారు. ఆరుణమాఫీను తమ ప్రభుత్వం తీర్చిన విషయాన్ని గుర్తుచేశారు. పైగా ప్రజలకు ఆర్థికసాయం చేస్తుంటే, రాష్ట్రాన్ని సింగపూర్‌లా దివాళా తీస్తున్నారన్న చంద్రబాబు ఇపుడు గతిలేక కాంగ్రెస్ మేనిఫెస్టోను కాపీచేస్తున్నారన్నారు.కొత్తనాటకంతో వచ్చే చంద్రబాబును చూసి జాలిపడి ఎవరైనా అయ్యో అంటే పదేళ్ళు ప్రగతి వెనక్కు వెళ్ళిపోతందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలలోజిల్లా కలెక్టర్ షన్మోహన్, జడ్పీఛైర్మన్ గోవిందప్పగారి శ్రీనివాసులు,రాష్ట్ర జానపదకళల అకాడమీ ఛైర్మన్ కొండవీటి,పిఎంకే ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, రాష్ట్ర వైకాపా కార్యదర్శి పెద్దిరెడ్డి, రాష్ట్ర మెప్మా ఎండి విజయలక్ష్మి,పిడి రాధమ్మ,జడ్పీసిఇఓ ప్రభాకర్‌రెడ్డి,డిఆర్‌డిఏ పిడి తులసి, ఛైర్మన్ అలీంబాషా, తహసీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి,ఎంపిడిఓ వెంకట మునిరెడ్డి,మార్కెట్ కమిటీఛైర్మన్ నాగరాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# పరుగులు పెడుతున్న అభివృద్ధి

## - డిప్యూటీ సిఎం నారాయణస్వామి



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న డిప్యుటీ సిఎం నారాయణస్వామి.

పాలసముద్రం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: జిడినెల్లూరు నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పరుగులు పెడుతుందని డిప్యుటీ సిఎం నారాయణస్వామి పేర్కొన్నారు.మండలంలో శుక్రవారం డిప్యుటీ సిఎం నారాయణస్వామి మండల వైకాపా అధ్యక్షులు తులసీయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొని ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఎటిఎం కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాలు చేపట్టి గ్రామాల్లో సమస్యలు లేకుండా చేయా లని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి కన్పించడం లేదని ఆ పార్టీ ప్రభుత్వంపై కుట్రలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రానికి 14 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా విధులు నిర్వర్తించిన నారా చంద్రబాబునాయుడు ఏం చేశారని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసీఅన్బుగలన్, వైస్ఎంపిపి శేఖర్‌మందడి, డిసిసిబి మేనేజర్ ఎం.మహేష్, డిజిఎం లిల్లీ క్యాథరిన్, ఎజిఎం వెంకటాచలపతి, సింగిల్‌విండో ఛైర్మన్ జ్యోతి, ఎంపిడిఓ రామ నాధరెడ్డి, డిప్యుటీ తహసిల్దారు మధుబాబు, ఇరిగేషన్ ఎఇ హిమంత్‌కుమార్, ఎంపిటిసీ గోవింద రాజులు, సర్పంచ్ అయ్యప్ప, నాయకులు పోలయ్య, కేశవరెడ్డి, చందర్‌రాజు, వేణు, సుమన్, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# సమస్యలను పరిష్కరించేందుకే జగనన్నకు చెబుదాం : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ లక్ష్మిశ, హాజరైన అధికారులు

తొట్టంబేడు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకే జగనన్నకు చెబుదాం.. కార్యక్రమ ంను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మిశ తెలిపారు. శుక్రవారం తొట్టంబేడు మండలంలోని ఎస్ఎస్ కళ్యాణమండపంలో జగనన్నకు చెబుదాం.. కార్యక్రమానికి ఆయన హాజయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ముంగిటకు సుపరిపాలన అందుబాటులోకి రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని వివరించారు. ప్రజాసేవ చేస్తే అది దేవుడికి సేవచేసినట్లే అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ముగింటకు సుపరిపాలన అందుబాటులోకి తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని, సచివాలయ సిబ్బంది ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలను ప్రజలను తెలిసేలా వారికి తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో ఏదేని సమస్యలు ఉన్నా ప్రజలుకు 1902 టోల్ ఫ్రీ నెంబర్‌ను ప్రభుత్వం అందుబాటులో తెచ్చిందని దీని ద్వారా ఫోన్‌కాల్ నుంచి అందిన ఫిర్యాదులను ముఖ్యమంత్రి కార్యాలయం పర్యవేక్షిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ ప్రభుత్వం అని అన్నారు. తిరుపతి జిల్లాలో దాదాపుగా చాలా వరకు స్పందన అర్జీల పరిష్కారం చేస్తున్నారని మరింత మెరుగ్గా చేయాలి ప్రజా సేవ చేస్తే అది దేవుడికి సేవ చేసినట్లే అని, సచివాలయ సిబ్బంది అధికారులు అందరూ బాధ్యతగా ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా సాను కూల దృక్పథంతో పనిచేయాలన్నారు. నిర్ణీత కాల వ్యవధిలోపు ప్రజల అర్జీలకు అర్థవంతంగా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిబంధనల మేరకు పరిష్కరించగలిగిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నిబంధనల పరిధిలో లేని పరిష్కరించలేని వాటిని అర్జీదారులకు స్పష్టంగా వివరించాలన్నారు. వివిధశాఖల నుంచి మొత్తం 45 రాగా ఇందులో రెవెన్యూకు సంబందించి 26 ఎక్కువగా వచ్చాయి. అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, డిఎల్‌డిఓ ఆదిశేషారెడ్డి, తహశీల్దార్ శివరామసుబ్బయ్య, డిప్యూటీ తహశీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపిడిఓ ఐసాక్ ప్రవీణ్, వైకాపా సీనియర్ నాయకుడు ఉన్నంవాసుదేవనాయుడు, మండల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పలువురు ప్రజలు పాల్గొన్నారు.

# అంతా ఏకపక్షం...ఏమిటీ నిర్లక్ష్యం...?

## ఈఓ, ఛైర్మన్ ఏకపక్ష నిర్ణయాలపై ఉభయదారుల ధర్నా -వివాదాస్పదమైన శ్రీవరసిద్ది వినాయక వైభవం,ఉపాసన విధానము గ్రంధం ఆవిష్కరణ



ఈఓ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహిస్తున్న ఉభయదారులు

కాణిపాకం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం ఈఓ, ఛైర్మన్‌లు అవలంభిస్తున్న ఏక పక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా దేవస్తానం ఉభయదారులు శుక్రవారం స్థానిక ఈఓ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. కాణిపాకం దేవస్థానం వద్ద గత కొంత కాలంగా రోజుకో వివాదం కొనసాగుతోంది. ఈనేపథ్యంలో కాణిపాకం ఆలయ ప్రాశస్థం, స్వామివారి పూజా విధానముపై విజయవాడకు చెందిన లక్ష్మీ సీతారాంజనేయులు శర్మ రచించిన "శ్రీవరసిద్ధి వినాయక వైభవం,ఉపాసన విధానము" గ్రంధం ఆవిష్కరణ తాజా వివాదానికి కారణమైంది. ఈగ్రంధంను సీఎం జగన్ చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించిన విషయం విధితమే. వెయ్యేళ్ళ చరిత్ర కలిగిన ఆలయ ప్రాశస్థంపై రచించిన ఈగ్రంధం ఆవిష్కరణ ఉభయదారుల ప్రమేయం లేకుండా ఏకపక్షంగా ముద్రించి ఆవిష్కరించడంతో ఉభయదారులు తీవ్రస్థాయిలో అగ్రహం వ్యక్తం చేస్తూ ఈఓ కార్యాలయంఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఉభయ దారులను సంప్రదించిన తర్వాతనే గ్రంధం ఆవిష్కరిస్తామని చెప్పిన ఆలయ ఛైర్మన్ రెండు రోజుల్లోనే ఉభయదారులకు తెలియజేయకుండానే గ్రంధంను ఆవిష్కరించడం ఎంత వరకు సమంజసమని బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఉభయదారులు ఈఓ డౌన్ డౌన్, ఉభయదారుల వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఏకపక్ష ంగా వ్యవహరిస్తున్న ఈఓను వెంటనే ఇక్కడ నుండి బదలీ చేయాలని, ఛైర్మన్ రాజీనామా చేయాలని డిమాండు చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈసందర్భంగా పలువురు ఉభయదారులు మాట్లాడుతూ ప్రస్తుత ఈఓ ప్రతి పని ఉభయదారులకు వ్యతిరేకంగా చేస్తూ ఉభయదారుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. గ్రంధం ఆవిష్కరణపై వెంటనే ఉభయదారుల సమావేశం ఏర్పాటు చేయాలని లేకుంటే ఈనెల 18న ఈఓ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈమేరకుధర్నా అనంతరం ఉభయదారులు ఏఈఓ రవీంద్రబాబు కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతి సాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్, మాజీ సర్పంచ్ గోపీనాధన్ జనసేన నాయకులు రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ విశ్వనాధరెడ్డిలతో పాటు పలువురు ఉభయదారులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

కుప్పంరూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

మండలంలోని నూలుకుంటలో శుక్రవారం కొత్తపల్లి పిహెచ్‌సి డా॥ సుభాష్‌రాజా అధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురికి మందులు, మాత్రలు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు శశికళ, మోహనశాంతి, ఉపాధ్యాయులు లక్ష్మమ్మ, యాస్మిన్ రజియా, అఖిలపాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి చంద్రబాబు ఆర్థికసాయం

శాంతిపురం/కుప్పం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



శాంతిపురం మండలం రెడ్లపల్లిలో తెదేపా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి గణేష్ భార్య రమాదేవి మృతి చెందింది. విషయం తెలుసుకున్న టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు గ్రామానికి చేరుకుని ఘన నివాళులు అర్పించారు. తెదేపా అధినేత చంద్రబాబునాయుడు తరపున ఇరవై వేలు, శాంతిపురంమండల పార్టీ తరపున 11వేలు, కురబ సంఘంచే ఎనిమిదివేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు, నేతలు జనార్ధ నరెడ్డి, చంద్ర, ఉదయ్‌కుమార్, రమేష్, స్థానిక నేతలు పాల్గొన్నారు.అలాగే కుప్పం మున్సిపల్ తంబిగా నిపల్లిలో తెదేపా సీనియర్ నేత రామన్న మృతి చెందగా ఆయన కుటుంబానికి చంద్రబాబు తరపున పదివేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సెల్వరాజ్, మాజీ సర్పంచ్ సురేష్‌కుమార్, బాబు, నాగేంద్రకుమార్, చెక్కునత్తం మణి, నరేష్ పాల్గొన్నారు.

## కొత్త ఓటరు కార్డులకు నమోదు చేసుకోండి

శాంతిపురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



శాంతిపురం సింగిల్‌విండో పరిధిలో ఓటు హక్కు కలిగిన రైతులు కొత్త ఓటరు కార్డులు పొందేందుకు నమోదు చేసుకోవాలని ఛైర్మన్ మునిరత్నం గౌడు, సిఇఒ శివారెడ్డి, మేనేజర్ గణేష్‌కుమార్ తెలిపారు. సొసైటీలో ఖాతా, షేరు కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉంటుందన్నారు. వీరు ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఫోన్ నెంబరు, పట్టాదారు పాసు పుస్తకం నకలు లేదా వన్‌బి అడంగల్ నకలు ఈనెల 12వతేదీలోగా సింగిల్‌విండో కార్యాలయంలో అందించాలని కోరారు.

## కేంద్ర పథకాలు జనంలో తీసుకెళ్లాలి

వి.కోట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లో తీసుకెళ్లాలని జిల్లా బిజెపి అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు సూచించారు. వి.కోటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పల్లెకుపోదాం కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో బిజెపి నేతలు విజయ్‌కుమార్, సోమశేఖర్, అట్లూరి శ్రీనివాస్, దామోదర్‌రెడ్డి, హేమంత్ పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఇరుపార్టీ నేతలచే ఆర్థికసాయం

రామకుప్పం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

మండలంలోని ఆరిమానుపెంట, గెర్నిపల్లి, బండకొత్తూరు గ్రామాలకు చెందిన శంకర్, చెంప నాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వైకాపా, తెదేపా నేతలు వారికి నివాళులు అర్పించారు. ఆయా పార్టీల తరపున చెరో పదివేల వంతున ఆర్థికసాయం అందించారు.

## చౌడేపల్లి ఎంపిడిఓగా డాక్టర్ వెంకటేశు

చౌడేపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



మండల ఎపిడిఓగా డాక్టర్ వెంకటేశు నియమితులయ్యారు. ఈమేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఎంపిడిఓ సుధాకర్ ఎన్నికల బదిలీల నిమిత్తం నెల్లూరు జిల్లాకు వెళ్లారు. కడప జిల్లా పులివెందుల ఎంపిడిఓగా వున్న డాక్టర్ వెంకటేశు చౌడేపల్లికి వచ్చారు. రాబోయే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేస్తానని ఆయన అన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

పట్టణంలోని 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్లలోను, 11కెవి లైన్లలో నెలవారీ మరమ్మత్తులు మరియు నిర్వహణ నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తిరుపతి డివిజన్ రూరల్ ఈఈ ఎన్.వాసురెడ్డి తెలిపారు. నేడు ఉదయం8 గంటల నుంచి శ్రీకాళహస్తి టౌన్, రూరల్, తొట్టంబేడు, బిఎన్‌కండ్రిగ, ఏర్పేడు మరియు కెవిబిపురం మండలాల పరిధిలోమధ్యాహ్నం 2గంటల విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

## రోడ్లు, నీరు ప్రభుత్వం కల్పించాల్సిన ప్రాథమిక హక్కు

– సీనియర్ సివిల్ జడ్జీ ఐ.కరుణకుమార్

చిత్తూరురూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

నీరు, విశాలమైన రోడ్డు ప్రజలకు ప్రభుత్వాలు సమకూర్చాల్సిన ప్రాథమిక హక్కు లని సీనియర్ సివిల్ జడ్జీ ఐ.కరుణకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో చిత్తూరుస్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సర్వసభ్య సమా వేశంను ఏర్పాటుచేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజల కోసం స్మార్ట్ సిటీ సభ్యులు కోరుతున్న 9 అంశాలు చట్టబద్ధంగా, న్యాయంగా ప్రజలందరీక కావాల్సిందేనన్నారు. అధ్యక్షుడు తాండవమూర్తి మాట్లాడుతూ నగరసమస్యలుతీరేంతవరకుతమసొసైటీ బృందంపోరాటం సాగిస్తూనే వుంటుంద న్నారు. అనంతరం సభ్యులకు జడ్జీ చేతులమీదుగా ఐడి కార్డులను అందజేసారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శివకుమార్, అధికారప్రతినిధి సత్య, ఎగ్జిక్యూటివ్ సభ్యులుమల్లికార్జునరావు,కుమరేషన్, ఆరణికవిత, శ్రీదేవి, సింద్, వరదరాజులు, షాదిక్, మున్సీర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కోలారు ఇస్తిమాకు భారీగా తరలిన ముస్లింలు

కుప్పం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

కర్ణాటక రాష్ట్రం జిల్లా కేంద్రమైన కోలారు సమీపంలో నిర్వహించిన ఇస్తిమా (ధార్మిక సదస్సు)కు కుప్పం, వి.కోట, పలమనేరు, పుంగనూరు ప్రాంతాల నుంచి భారీగాముస్లిం మైనార్టీలుతరలివెళ్లారు. గురు,శు క్రవారాల్లో ఈ ఇస్తిమా జరిగింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లిం గురువులు ఇస్లాం పవిత్రత, ప్రవక్తచరిత్ర,జీవితంలోఅనుసరించాల్సిన మంచి మార్గాలు తదితరాలపై వివరించారు.

## కుప్పం మున్సిపల్ కమీషనర్‌గా చరణ్‌తేజ్‌రెడ్డి

కుప్పం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

కుప్పం నూతన మున్సిపల్ కమీషనరుగా చరణ్ తేజ్‌రెడ్డి నియమితులయ్యారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన బదిలీల్లో భాగంగా ఈనియామకం జరిగింది.ఈయన రాష్ట్రఆడిట్ శాఖలోసహాయ ఆడిట్ ఆఫీసరుగా పనిచేస్తున్నారు. ఈయనకు తిరుపతి మున్సిపల్ కార్పోరేషన్ అదనపు కమీషనరు పోస్టుతో కుప్పం మున్సిపల్‌కమీషనరు (ఎఫ్ఎసి)గా నియమించారు. కుప్పంలో కమీషన రుగా ఉన్న కీలపట్టు రాధిక నెలవ్యవధిలోనే బదిలీ కావడం గమనార్హం. అలాగే నగరి కమీషనరుగా ఉన్న ప్రభాకర్‌రావును పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథా రిటీ కార్యదర్శిగా నియమించారు. నగరి కమీషనరుగా నందికొట్కూరు మున్సిపల్ మేనేజరు మంజునాథగౌడు నియమితులయ్యారు.

### చెరువు చుట్టూ పాదచారుల కోసం ఫుట్‌పాత్ - మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్

కుప్పం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



స్థానిక పాతపేట వద్ద గల కుప్పం చెరువు చెట్టూ చేపట్టిన ఫెన్సింగ్ పనులను మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పరిశీలిం చారు. పనులు దాదాపు 80శాతం పూర్తయ్యాయని మిగతా పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పనులు పూర్తికాగానేపట్టణప్రజలు,పిల్లలుసాయంత్రం, ఉదయంవేళల్లో నడిచేందుకు వీలుగా ఫుట్‌పాత్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు సయ్యద్ అలీ, నాగరాజు, అరవింద్, ఆంజనేయగుడి ఛైర్మన్ కుమరేష్, ఐదో వార్డు ఇన్‌చార్జ్ సిపి మనోహర్‌పాల్గొన్నారు.

## రైతులకు అండగా నిలిచేది చంద్రబాబే - మునిరత్నం

కుప్పం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



రాష్ట్రంలో ఉన్న రైతులకుఅండగా నిలిచేది మాజీ సిఎం చంద్రబాబునాయుడేనని తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన చంద్రన్న రైతు చైతన్యయాత్ర కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని వైకాపా ప్రభుత్వం కుదేలు చేసిందన్నారు. రైతుల సాగునీరుకు అవసరమయ్యే ప్రాజెక్టుల నిర్మాణం అటకె క్కించారన్నారు. చివరకు ఐదేళ్ల కాలంలో కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు కూడా పూర్తి చేయలేదన్నారు. మరలా తెదేపా అధికారంలో రాగానే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, విశ్వనాథనాయుడు, నేతలు చలపతి, ఆంజనేయరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి ఎమ్మెల్సీ భరత్ విరాళం



కుప్పంరూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త మండలంలోని మహ్మద్‌పురం పంచాయతీ కె.కృష్ణాపురంలో వెలసిన శ్రీ చాముండేశ్వరి అమ్మవారి ఆలయ మహాకుంభాభిషేక కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్, మున్సి పల్ ఛైర్మన్ డా॥ సుధీర్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ భరత్ ఆలయానికి తనవంతుగా యాభైవేల విరాళ ం అందించారు. ఆలయ అభివృద్ధికి ఇదివరకే ఐదులక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కాగా సర్పంచ్ నాసిర్ సైతం ఇరవై వేల విరాళ ం అందించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సామన్న, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం



## హైవే రోడ్డు కూలీ మృతి

**గంగాధర నెల్లూరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** మండలంలో తర్చూరు హైవే రోడ్డు నిర్మాణ పనుల్లో శుక్రవారం ఓ కూలీ మృతి చెందినట్లు స్థానిక సిఐ శంకర్ తెలిపారు.పోలీసులు కథనం మేరకు జార్ఖండ్‌కు చెందిన గులా(46) అనే కూలీ కుటుంబ పోషణ కోసం హైవే రోడ్డు పనుల్లో కూలీగా చేరాడు అయితే మండలంలోని ముక్కత్తూరు వద్ద జరుగుతున్న నిర్మాణ పనుల్లో ప్రమాదవశాత్తు క్రేన్‌హైడ్రాలిక్ ఫెయిల్యూర్ కావడంతో క్రేన్ కింద పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఈ మేరకు సిఐ శంకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 14 నుండి జిల్లా ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్

చిత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్ ఈ నెల 14వ తేదీ నుండి 16వ తేదీ వరకు యాదమరి మండలం చెన్నై-బెంగళూరురహదారిలోమోర్థానపల్లి పిఇఎస్ పాఠశాల లో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సి.దేవరాజు పేర్కొన్నారు. ఇది వరకు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌ను ఈ నెల 10 నుండి 12వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించి ప్రకటించామని,అయితే ప్రస్తుతం నిర్వహణ తేదీలను మార్చినట్లు ఆయన తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో జిల్లాకు సంబంధించి 417 ప్రాజెక్టుల గైడ్ ఉపాధ్యాయులు, పాఠశాల హెడ్మాస్టర్లు ఎంపికైన విద్యార్థుల చేత తగు రీతిలలో ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు రూపొందించడానికి, వాటిని ప్రదర్శించడానికి చొరవ చూసి విద్యార్థులను సంసిద్ధులు చేయాలని ఆయన కోరారు. ఈ ఎగ్జిబిషన్ నిర్వహణకు సంబంధించి ఎదైనా సందేహాలు వుంటే జిల్లా సైన్స్ ఆఫీసర్ ఆర్‌వి రమణ ఫోన్: 97018 71545 సంప్రదించాలని కోరారు.

## నిరుద్యోగ యువతకు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి

– జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డిఎంకె తులసీ



**చిత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిరుద్యోగ యువతకు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి కల్పించే దిశగా సీడాప్-డిఆర్‌డిఎ ప్రయత్నాలు చేపట్టినట్లు డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బెంగళూరుకు చెందిన ప్రముఖ శిక్షణ సంస్థ నవగురుకుల్‌తో కలిసి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన 50 మంది నిరుద్యోగ యువతులకు సాఫ్ట్‌వేర్ కోడింగ్ కోర్సులో శిక్షణ ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. టెన్త్ నుండి డిగ్రీ వరకు చదువుకొని 17-27 సంవత్సరాల వయస్సు వున్న యువతులు ఈ శిక్షణకు అర్హులన్నారు. అలాగే ట్రాన్స్‌జెండర్‌లు సైతం ఈ శిక్షణకు అర్హులని,ఒక ఏడాదిశిక్షణ వుంటుందని ఈ కాలంలో అభ్య ర్థులకు సంస్థ పూర్తి వసతి, భోజన సదుపాయం కల్పిస్తోందన్నారు. నవగురుకుల్ సంస్థ నిర్వహించే స్క్రీనింగ్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారికి మాత్రమే ఉచిత శిక్షణకు అర్హత వుంటుందన్నారు. శిక్షణ అనంతరం ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో నెలకు 20 వేల రూపాయల వేతనంతో వంద శాతం ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు.

## గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ జీతాలు చెల్లించండి - ఎఐటియుసి

చిత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

గ్రామ పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్‌లో వున్న 15 నుండి 25 నెలల జీతాలు సత్వరం చెల్లించాలని జిల్లాఎఐటియుసి గౌరవాధ్యక్షుడు నాగరా జన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జడ్పీకార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కోదండ య్య, గౌరవాధ్యక్షుడు నాగరాజన్‌లు మాట్లాడుతూగత 25 నెలలుగా గ్రీన్ అంబా సిడర్లకు జీతాలివ్వలేదని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేకపోయిందన్నారు. అనంతరం ఎఐటియుసి నాయకులు జడ్పీ సిఇఒ కార్యాల యంలో డిపిఆర్‌సి జిల్లా కో-ఆర్డినేటర్ షణ్ముగరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు గోవిందస్వామి, రమాదేవి, రాజేంద్ర, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధి ప్రధాని మోడి లక్ష్యం

– మాజీ ఎంపి ఎన్‌పి దుర్గారామకృష్ణ

**గుడిపాల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్రమోడి అహర్నిశలు కృషి చేస్తున్నారని మాజీ ఎంపి ఎన్‌పి దుర్గారామకృష్ణ పేర్కొన్నారు. సిఎం కండ్రిగ లో శుక్రవారం బిజెపి నాయకులు దేవరాజన్ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంకు హాజరైన దుర్గారామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని మోడి ఆధ్వర్యంలోని బిజెపికి రానున్న ఎన్నికల్లో ప్రజలు పట్టం కడితే దేశం సుభిక్షంగా వుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సి.బాబు, మోహన్‌నాయుడు,దేవరాజన్,ధనంజయనాయుడు,నిత్యానందం, ప్రభాకర్‌నాయుడు, మనస్వి, రమ, విజయకుమారి, మురళి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## గర్భిణీలకు పౌష్టికాహారం అందజేత

గూడూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త



గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జనవిజ్ఞానవేదిక ఆధ్వ ర్యంలో టమోటా మర్చంట్ సెల్వం గర్భిణులకు వెజిట బుల్ రైస్, గుడ్డు, అరటిపళ్ళు అందచేశారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్‌షరీనా, డాక్టర్ రాజా వాటినిపంపిణీ చేసారు. ఈ సందర్భంగా షరీనామా ట్లాడుతూ విదార్థులలో సైన్స్ పట్ల అవగాహన కార్యక్ర మాలుచేపట్టడంఅభినందనీయమన్నారు.ఈ కార్యక్రమం లో జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్ర ప్రసాద్,చెంచునారాయణ, రామ్మోహన్, పురు షోత్తం రావు,నాగరాజు,ప్రభాకర్,గుర్రం విజయ్‌బాబు, కటకం శ్రీను,జగదీష్,ఇబ్రహీం,ఆనంద్, సుబ్బా రావు, పసల వెంకటేశ్వర్లు, శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

## బిజేపి కిసాన్ మోర్చా నూతన కమిటీ ఎంపిక

గూడూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త



బిజేపి కిసాన్ మోర్చా గూడూరు నియోజకవర్గ కన్వీనర్ అధ్యక్షులు గాలి ప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో గూడూరు బిజేపి కార్యాలయంలో శుక్రవారం నూతన కమిటీ ఎంపిక చేసారు. బిజేపి జిల్లా అగ్రికల్చర్ విద్యుత్ సెల్ కన్వీనర్ ఆర్. రవికుమార్, గూడూరు కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షులుగా అరికట్ల పద్మయ నాయుడు, ప్రధాన కార్యదర్శిగా నీలం వంశీకృష్ణారెడ్డి, గుంటపూడి మధు ఎంపిక చేశా రు.అనంతరం గూడూరు పట్టణ అధ్యక్షులు అరికట్ల బాలకృష్ణ నాయుడుకి కమిటీ నివేదికను అందించారు.

## ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవు

ఆర్డీఓ కిరణ్ కుమార్

గూడూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త



ఎన్నికల విధులకు కేటాయించబడిన సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్ని కల రిటర్నింగ్ అధికారి ఎం. కిరణ్‌కుమార్ హెచ్చ రిం చారు. నియోజకవర్గంలోని క్లస్టర్ ఆఫీసర్లు, ఎన్ని కలఅధికారులతో ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్అధికారి ఎం.కిరణ్‌కుమార్‌సమీక్ష సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాల్లోఎన్నికలు సజావుగాజరగడానికి గూడూరు అర్బన్ లో 3, రూరల్ పరిధి లో 8, చిల్లకూరు 5, కోట 5, వాకాడు 5, చిట్టమూరు 7 చొప్పున క్లస్టర్స్‌గా విభజించామన్నారు. ఒక్కొక్క క్లస్టర్ ఆఫీసర్ కనీసం 10 నుండి 13 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలను ఎలాంటి సమస్యలు లేకుండా సజావుగా జరిపించేందుకు చర్యలు తీసుకోవాలనితెలిపారు. ఈ సమీక్షలో డిఎస్‌సి సూర్యనారాయణ రెడ్డి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## బిజేపితోనే దేశాభివృద్ధి : గిద్దలూరి మనోజ్ కుమార్

గూడూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త



బిజేపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాల మేరకు ఓటు హక్కు వినియో గం, కేంద్ర ప్రభుత్వ పథకాలపై గూడూరులో అవగాహనసదస్సు నిర్వహించారు. రెండవ పట్టణ పరిధిలోని విద్యాలయ కళాశాలలో డిగ్రీ విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి బీజేవైఎం రాష్ట్ర అధికారి ప్రతినిధి గిద్దలూరి మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యువత ఓటు హక్కును వినియోగించుకుని కేంద్రంలో బిజేపికి మరోసారి ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ రెడ్డి, బీజేవైఎం నాయకులు శంకర్, చైతన్య, ప్రదీప్, నవీన్, కిరణ్, రోషన్ సాయి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రస్ట్ ద్వారా పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ



**గూడూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** స్థానిక డిఎన్ఆర్‌కమ్యూనిటీ హాల్ ఆడిటోరియంలో రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యవసర సరుకులు అందజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వైసిపి నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కంటి రామ్మోహన్ రావు, నాగులు, గిరి, శ్రీనివాసులు, పాదర్తిప్రసాద్ పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలి : సిఐటియు




**గూడూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆశావర్కర్లను, సిఐటియు నాయ కులను అక్రమంగా అరెస్టు చేసిన ఆశావర్కర్ల నాయకులను వెంటనే విడుదల చేయాలని గూడూరు టవర్‌క్లాక్ సెంటర్‌నుండి ప్రదర్శనగా వెళ్ళి ఆర్డీఓ ఆఫీస్ ఎదుట ఆశావర్కర్లు నిరసనకార్యక్రమంచేపట్టారు. తమడిమాండ్లతో కూడిన వినతిపత్రంను ఆర్డిఓ ఎం. కిరణ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఆశా వర్కర్ల అధ్యక్షురాలు పి. చెంగాలమ్మ, కార్యదర్శి కె. జానకి, జిల్లాఉపాధ్యక్షురాలు కె.ఉష, జిల్లా సహాయ కార్యదర్శి బి. కృష్ణవేణి, సిపిఎం నాయకులు జోగిశివకుమార్, సిఐటియు పట్టణ అధ్యక్షులు బివి రమణ య్య, కార్యదర్శి ఎస్.సురేష్, పామంజి మణి, ఏ.ప్రసాద్, బి.చంద్రయ్య, గుర్రం రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఈ కంపు భరించలేము..!



**వాకాడు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** వాకాడు మెయిన్ పాత దళితవాడ డ్రైనేజీలో చెత్త చేరి దుర్వాసనతో దోమల బెడదతో ప్రజలు అల్లాడుతున్నారు. శుక్రవారం స్థానిక దళితవాడ ప్రజలు తమ దుస్థితిని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న వీధులు డ్రైనేజీ కాలువలో చెత్తా చెదారం మట్టి కాలవల్లో ఉండి పోవడంతో ఇంటి ముందు ఉన్న డ్రైనేజీలో అక్కడికక్కడేచెత్తచేరిదుర్వాసనతోపాటు,దోమలబెడద ఎక్కువైందని వాపోయారు. విషపూరిత, డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబులుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యవసర సమయంలో కానీ, లేదా అధికారులు వస్తున్న సమయంలో గాని తప్ప మిగిలిన ఏళ్లబడి డ్రైనేజీలు పట్టించుకున్న దాఖలు లేవన్నారు. కనీసం రెండు వారాలకు ఒకసారి అయినా కాలువలో పూడిక తీసి బ్లీచింగ్ చెల్లిన పాపాన లేదని, సంబంధించిన పంచాయితీ అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

## ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రత వారోత్సవాలు

**సూళ్లూరుపేట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** సూళ్లూరుపేట ఆర్టీసీడిపోలో శుక్రవారం రోడ్డు భద్రత వారోత్స వాలు నిర్వ హించారు. ఆర్టీసీ కార్మికులు ఈ సందర్భంగా ప్రదర్శన నిర్వహించారు. డిపో మేనేజర్ మల్లికార్జున మాట్లాడుతూ రోడ్డు భద్రత వారోత్సవాల్లో డ్రైవర్లు రోడ్డు భద్రతకు సంబంధించిన నిబంధనలనుక్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.శేఖర్, డిపో సెక్రటరి ఎఎస్ మణ్యం, ఎంప్లాయిస్ యూనియన్ ఎంఎ అలీమ్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ సురేష్, ఎఎంఎఫ్ రమేష్‌బాబు, సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ బివి కృష్ణ, ఆచారి, శశి తదితరులు పాల్గొన్నారు.

## వేణుగోపాల స్వామి ఆలయంలో రాంకుమార్ రెడ్డి పూజలు

**వెంకటగిరి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** స్థానిక బంగారుపేటలో వేణుగోపాల స్వామి ఆలయంలో వెలసిన కనకవల్లి వేదవల్లి సమేత వీర రాఘవేంద్ర స్వామి కలిసి పూజలో వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ మర్యాదలతో రామ్ కుమార్ రెడ్డికి కౌన్సిలర్ సుబ్బారావు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కరించండి



**బాలాయపల్లి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** మండలంలో భూసమస్యల పరిష్కారానికి కృషిచేయాలని తహశీల్దార్ పుల్లారా వును ఎంపిపి గూడూరు భాస్కర్ రెడ్డి కోరారు. తహశీల్దార్ కొత్తగా బాధ్యతలు చేప ట్టడంతోఆయనను ఎంపిపి మర్యాదపూర్వకంగా కలిశారు. అనేక భూ సమస్యలతోప్రజలుఇబ్బందులుపడుతున్నారనివాటినిపరిష్కరించాలనికోరారు.ఆయనవెంటనాయకులు అల్లంశేఖర్ పాల్గొన్నారు

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

మండలంలోని అలిమిలి, జయంపు, మన్నూరు, నిడిగల్లు తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహ శీల్దార్‌పుల్లారావుపరిశీలించారు.పోలింగ్ కేంద్రాల్లోతగు వసతులు లేవని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి



**కోట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని చిట్టేడు సొసైటీ మాజీ ఛైర్మన్ ఉలవకాయల ప్రసాద్, కేశవరం వైసీపీ నాయకు డు శ్రీరామ్ గురుస్వామిలు అన్నారు. శుక్రవారం మండల పరిధి లోని కేశవరంలోరెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ వైద్యం అందిస్తున్న ఘనత వైసీపీ ప్రభుత్వానిదే అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంపి డిఓ శ్రీనివాసులు, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ రాధా, డాక్టర్ నాగరాజు, డాక్టర్‌వెంకట రమణయ్య,డాక్టర్‌లక్ష్మమ్మ,పెంచలయ్య,కేశవరంపంచాయతీ కార్య దర్శి లోహిత్‌కుమార్, మద్దాలిపం చాయతీ కార్యదర్శి సురేష్, ఎఎన్ఎం మణెమ్మ, కేశవరం ఉపసర్పంచ్ సుబ్బన్న,విగ్రహాలరఘురామయ్య,గ్రామవాలంటీర్లు,గృహసారధులు,సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులదే భవిష్యత్తు



– ఎన్‌బికెఆర్‌లో ఎంప్లాయిబులిటి స్కిల్స్‌పై అవగాహన

కోట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

మండల పరిధిలోని విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో శుక్రవారం సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎంప్లాయిబులిటిస్కిల్స్ అనే అంశంపై అవగా హన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల పూర్వవిద్యార్థి రాజేష్‌రెడ్డి (అరబిందో ఫార్మ కంపెనీ ప్రాజెక్టు మేనేజర్) విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల రూపకల్పనలో సివిల్ ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని, మనం చూసే అందమైన రహదారులు, వంతెనలు, ఆనకట్టలు, ఆకర్షణీయమైన భవన నిరానమణాల వెనుక సివిల్ ఇంజనీర్ల కృషి దాగిఉందని పేర్కొన్నారు. సివిల్‌ఇంజనీరింగ్ ఉద్యోగ అవకాశాలకు సముద్రంలాంటిదని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం వెంపర్లాడాల్సిన అవసరం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ డి.శ్రీనివాస్, ప్రొఫెసర్ సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## టెన్నికాయిట్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మయూరి శ్యామ్ యాదవ్



**గూడూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** పట్టణసమీపం లోని మినిగురుకులంలో నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ అసోసి యేషన్ వారిజాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు అభినందన సభ జరిగింది. ఉత్తమ క్రీడాకారులకు నగదు, సర్టిఫికేట్‌లను అధ్యక్షులు మయూరి శ్యామ్‌యాదవ్ దాతృత్వంతో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మండల, డివిజన్, జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మినీ గురుకులం హెడ్ మాస్టర్ మేరీ ప్రియతి, పైడి కోటేశ్వరరావు, పంతగిరి, భాస్కర్, కరిముల్ల ఖాన్, మిని గురుకకులం పిఈటినాగురమ్మ, మినిగురుకులం ఉపాధ్యాయు నులు పాల్గొన్నారు.

## బోడిలింగాలపాడు వద్ద రోడ్డు ప్రమాదం

– యువకుని మృతి



**తడ ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** తడ మండలం బోడిలింగాలపాడు వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. మోటార్‌బైక్‌పై తడ నుంచి సూళ్లూరుపేట వైపు వస్తున్న ఎం.జ్యోదిష్ (18) ప్రమాదానికి గురయ్యాడు. బోడిలిం గాలపాడు సమీపంలో ఈ యువకుడు వేగంగా మోటార్‌బైక్ నడుపుతూ ముందు వైపు వెళుతున్న లారీని ఢీకొని అదుపుతప్పి పడిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మృతుని వివరాలు తెలుసుకొని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తడ ఎస్ఐ జెపి శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని గుమ్మిడిపూండి తాలూకా రాఘవరెడ్డిమేడు గ్రామానికి చెందిన జ్యోదిష్ తడ మండలం కొండూరులోని బంధువుల ఇంటికి వెళుతూ ప్రమాదానికి గురైనట్లు తెలిసింది.

## అన్నపూర్ణ అన్నదాన సమాజానికి రూ.3 లక్షల విరాళం



**తడ ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** తడ మండలం చినమాంబట్టులోని చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీకాశీ విశ్వేశ్వరాలయం వద్ద అన్నపూర్ణ అన్నదానం సమాజం కోసం శుక్రవారం రూ.3 లక్షలు విరాళం అందజేశారు. తైఅమావాస్య సందర్భంగా శుక్రవారం ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామపెద్దల సమక్షంలో సాంప్రదాయబద్ధంగా గోపూజ జరిపారు. ఈ సందర్భంగా చినమాంబట్టులో ఉండి చెన్నైలో స్థిరపడిన గుంటూరు గోపాలకృష్ణ శర్మ, త్రిపుర సుందరి దంపతులు, వారి పెద్దలు వెంకటసుబ్బ నరసయ్య, మధురిమల జ్ఞాపకార్థం రూ.లక్ష అన్నదానం కోసం విరాళంగా ఇచ్చారు. తైఅమావాస్య పూజల ఉభయకర్తలుగా వ్యవహరించారు. వీరితో పాటు పెదమాంబట్టుకు చెందిన పాముల రాజయ్య, శకుంతమ్మల తరపున ఎన్ఆర్ఐ అయిన వారి మనుమడు సాయికార్తీక యాదవ్ రూ.2 లక్షలు అన్నదానం కోసం విరాళంగా అందజేశారు. ప్రతి విజయదశమి రోజు వారి పేర ఆలయంలో అన్నదానం జరపాలని కోరారు. తిరుపతి స్విమ్స్ వైద్యులు డాక్టర్ కారణి మునస్వామి ఈ అన్నపూర్ణ అన్నదాన సమాజానికి స్థాపకులుగా ఉన్నారు. ఆయన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాంబట్టు సర్పంచ్ రమణయ్య, సిహెచ్ దేవేంద్రరెడ్డి, పి.పురుషోత్తం, కె.నందారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## అభివృద్ధి...సంక్షేమం నా బాధ్యత



**పుత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** : నగరి నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమం తన బాధ్యత అని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ అన్నారు. శుక్రవారం పుత్తూరు మునిసిపాలిటీలోని 23వ వార్డులో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షల కోట్లు అప్పులు చేసినా ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి కానరావడం లేదన్నారు. టిడిపి హయాంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని తెలిపారు. వైసిపి పాలనలో ఇంటి పన్నులు, కరెంట్ ఛార్జీలను విపరీతంగా పెంచారని, నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి దివంగత గాలి ముద్దు కృష్ణమనాయుడు నగరి అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. ఆయన బాటలో తాను కూడా అభివృద్ధికి కట్టుబడి వుంటానని, ప్రజలు టిడిపి ఆదరించి, వైసిపిని సాగనంపాలని కోరారు. కార్యక్రమంలో వార్డు నాయకులు బొల్లినేని మధుకుమార్, గోపి ఆచ్చారి, ప్రభాకర్‌రెడ్డి, బాబునాయుడు, టిడిపి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.ఎన్.ధనపాల్, బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా కైలాసనాధుని లోబావి ఉత్సవం



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** దక్షిణ కైలాసంలో వెలసిన భోళాశంకరుని లోబావి ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ఏడాదిలో ఒక్కసారి ఇక్కడకు తై అమావాస్య సందర్భంగా ఈ ఉత్సవాన్ని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముందు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో శుక్రవారం ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను చక్కగా అలంకరించారు. మేళతాళాలు మంగళవాయిద్యాలతో సన్నిధివీధి, శివయ్యసదన్‌ల మీదుగా స్వామి అమ్మవార్లను వేలాది మంది భక్తులు వెంటరాగా లోబావి (భరద్వాజ తీర్థం) వద్దకు చేర్చారు. అక్కడ భరద్వాజేశ్వరుని ఆలయం ఎదురుగా ఉత్సవర్లను ప్రతిష్టించి వేద పండితులు వేదమంత్రాల్ని ఘోషిస్తుండగా శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు షోడషాభిషేకాలు నిర్వహించారు. గతంలో గర్భగుడికి సమీపంలో ఏర్పాటు చేసి అభిషేకాలు నిర్వహించే వారు. శుక్రవారం భక్తుల సంఖ్య అధికంగా ఉండటంతో దర్శించుకోవటానికి వీలు లేనందువల్ల అందరికి సుదర్శనం కోసం అర్చకులకు ఆదేశించారు. భరద్వాజతీర్థంలో ఉన్న మండపంలో ఏర్పాటు చేసి అభిషేకాలు జరిపారు. భక్తులు తనివి తీరా స్వామి అమ్మవార్ల షోడషాభిషేకాలు తిలకించారు. అనంతరం అక్కడ నుంచి స్వామి అమ్మవార్లకు ప్రత్యేకాలంకారం జరిపి బ్రహ్మ గుడి వద్దకు తీసుకువచ్చారు. అక్కడ బూడిదమిట్ట వాసులు స్వామి అమ్మవార్లను దర్శించుకొని హారతులిచ్చారు. అక్కడ నుంచి సాయంత్రం ఆలయానికి చేర్చారు. తై అమావాస్య సందర భంగా ఇక్కడకు స్వామి అమ్మవార్లను తీసుకురావటానికి నాడు భరద్వాజ మహామునికి ఇచ్చిన వరం మేరకు ఉత్సవాల్ని నిర్వహిస్తున్నారు. ఆలయం నుంచి స్వామి అమ్మవార్లను చక్కగా అలంకరించుకొని ఊరేగింపుగా సాగారు. ఏడాదిలో ఒకే ఒక రోజు వచ్చే ప్రాంతాల్లో భక్తులకు పండుగ వాతావరణం చోటు చేసుకుంది. మామిడి తోరణాలు కట్టారు. ఉత్సవాల నిర్వహణలో ఆలయ కార్యనిర్వహణాధికారి ముందుజాగ్రత్తలు తీసుకున్నారు. సమయ పాలన తో నిర్వహించటంతో భక్తులకు ఎంతో సంబరంగా మారింద్లి. ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ప్రత్యేకాహ్వానితులు చింతామణి పాండు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## భరద్వాజతీర్థంలో అన్నదానం

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**



. తై అమావాస్య సందర్భంగా భరద్వాజతీర్థంలో స్వామిఅమ్మవార్ల దర్శనానికి విచ్చేసిన భక్తులకు సత్యవ్రత భాస్కర అన్నదాన ట్రస్టు వారిచే అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గరికపాటిరమేష్‌బాబు పర్యవేక్షణలో ఏర్పాటు చేసారు. అన్నదాన కార్యక్రమాన్ని శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రారంభించారు. డెప్యూటీ ఇఓ వెంకటసుబ్బయ్య, సూర్య ప్రసాద్, గరికపాటిచంద్రశేఖర్, అమర్‌నాథ్, వాసుయాదవ్, పుణ్యం ఢిల్లిబాబు, పసల కుమార్‌స్వామి, బాలాగౌడ్ తదితరులు పాల్గొ న్నారు. కాగా 23వ వార్డు కొండమిట్ట వినాయస్వామి ఆలయం వద్ద మాఘ తై అమావాస్య సందర్భంగా గౌరీపూజను నిర్వహించారు.

## దేశం పార్టీలో చేరిన వైకాపా యువత

**శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రేణిగుంట మండలానికి చెందిన పలువురు వైకాపా యువతగా చెప్పబడుతున్న వారు శుక్రవారం ఊరందూరు గ్రామంలోని బొజ్జల సుధీర్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ నేపధ్యంలో సురేష్‌యాదవ్ సారధ్యంలో యువకులు చేరారు. వారికి సుధీర్‌రెడ్డి స్వాగతం చెబుతూ పార్టీ కండువాలను వేసి ఆహ్వానించారు. చేరిన వారు రాబోవు రోజుల్లో పార్టీ అధినాయకుడు చంద్రబాబునాయుడు యువతకు భరోసా ఇచ్చారని జాబ్ గ్యారంటీప్రకటించారని వివరించారు. ఆయనతో జగదీష్, సరేంద్ర, సాయి, పురుషోత్తం తదితరులున్నారు.

## తొట్టంబేడు తహశీల్దార్‌గా శివరామసుబ్బయ్య

**. తొట్టంబేడు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**



తొట్టంబేడు తహశీల్దార్‌గా ఓజిలి తహశీల్దార్‌గా పనిచేస్తున్న శివ రామసుబ్బయ్యను నియమించారు. ఈమేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనకు డిప్యూటీ తహశీల్దార్ సుధీర్‌రెడ్డి స్వాగతం పలికారు. కాగా ఎంపిడిఓగా ఆత్మ కూరు మండలం నుంచి వచిచన పి.ఐసాక్ ప్రవీణ్ నేడు బాధ్య తలు స్వీకరించారు. ఈసందర్భంగాఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు.

## బలిజ సంఘ గౌరవాధ్యక్షులుగా గాజుల

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి బలిజ సంఘాధ్యక్షుడుగా గాజుల సత్యనారాయణను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఆయన్ను ఎన్నుకున్నారు. సుమారు 40 సంవత్సరాల నుంచి రాజకీయంగా కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుడుగా పవార్ కుటుంబానికి నమ్మిన బంటుగా ఉంటున్నారు. దీర్ఘకాలంగా కాంట్రాక్టర్‌గా వ్యవహారించిన ఆయన పారిశ్రామిక వెత్తగా రాణించారు. శ్రీకాళహస్తిలో ని కాపు సామాజిక వర్గంలో పెద్దగా ఉంటున్న ఆయన సేవలను రాబోవు రోజుల్లో బలిజ సంఘ భవన నిర్మాణంలో సద్వినియోగం చేసుకొనుటకు సంఘం ఆయనను గౌరవాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఆయనను పలువురు సత్కరించారు.

## పట్టణ బలిజ సంక్షేమ సంఘ నూతన కమిటీ ఎన్నిక



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** పట్టణ బలిజ సంక్షేమ సంఘం నూతన కమిటీని శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయ ఛైర్మన్ అంజూరుశ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా పోలస్వామి స్వర్ణమూర్తి వ్యవహరించారు. అనంతరం ఎంపిక తర్వాత దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరుతారకశ్రీనివాసులు నూతన కమిటీని అన్ని పార్టీలలోని వారిని ఈకమిటీలో నియమించినట్లు వివరించారు. ఎంపికైన కమిటీ సభ్యులను దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం ఎన్నికల అధికారి అందరిచే ప్రతిజ్ఞచేయించారు. పట్టణ బలిజ కుటుంబసభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా ఆలయ ఛైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు మాట్లాడుతూ త్వరలో బలిజ యువత కమిటీని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదేవిధంగా బలిజకులస్తులకు ఏర్పాటు చేసిన స్థలంలో ఈనెల 12వ తేదీన మధ్యాహ్నం భూమిపూజ కార్యక్రమం ఉంటుందని ఇందుకు అన్ని పార్టీల పెద్దలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. గౌరవాధ్యక్షులుగా గాజులసత్యనారాయణ, అధ్యక్షులుగా ఉప్పుక్రిష్ణయ్యరాయల్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా పూలకృష్ణ మూర్తి, ఉపాధ్యక్షులుగా డివి.నారాయణ, చిట్టివేలు జయగోపాల్, సొట్టాసుకుమార్, బుగ్గాప్రసాద్, మున్నారాయల్, కొట్టే నరేష్, బుల్లెట్ జయశ్యాం, ప్రధాన కార్యదర్శిగా కంటా ఉదయ్‌కుమార్, కార్యదర్శులుగా నాగమల్లి రాజశేఖర్, మొగరాల గణేష్, వజ్రంకిషోర్, మద్దెల లీలాకుమార్, పోలస్వామి కార్తీకేయన్, ట్రెజరర్‌గా పుష్పాల నవనీత కుమార్, ప్రచార కార్యదర్శులుగా కోలా. వెంకటేశ్వరరావు, సిద్దులుగారిమురలీ, చక్రాలమహేష్, పూడి రవికుమార్, సహాయ కార్యదర్శులుగా కిట్టు, శెట్టిపల్లిశివకుమార్, జివి.అమర్నాద్, పనబాకం గోపాల్ మరియు కార్యనిర్వాహక సభ్యులను ఎన్నుకున్నారు.

## గంజాయి అక్రమ రవాణా కేసులో నలుగురు ముద్దాయిల అరెస్టు

**సుమారు 4 లక్షల రూపాయల విలువ గల 20 కేజీల గంజాయి స్వాధీనం**

**తిరుపతి క్రైం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** గంజాయి అక్రమ రవాణా కేసులో నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసి సుమారు 4 లక్షల రూపాయిల విలువ గల 20 కేజీల గంజాయినీ తిరుపతి ఈస్ట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఎస్పి పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు తిరుపతి డిఎస్పి సురేంద్ర రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నరసరావు పేటలో కొనుగోలు చేసి తమిళనాడు సరిహద్దుకు తరలిస్తుండగా తిరుపతి రైల్వే హాలిడే హోమ్ దగ్గర మాటు వేసి ఒక మగ విక్రేత సత్తుపాటి లోకేశ్వర రావు, ముగ్గురు మహిళా స్మగ్లర్ల బండారి రూపవతి, వీరంకి దుర్గ, బండారి కుమారీలను తిరుపతి ఈస్ట్ పోలీసులు అరెస్టు చేసిన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా రాబడిన సమాచారం మేరకు తన స్వీయ పర్యవేక్షణలో తిరుపతి ఈస్ట్ సిఐ మహేశ్వర్ రెడ్డి, ఎస్ఐ పురుషోత్తం రెడ్డి, పోలీస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేస్తుండగా తిరుపతి డిఆర్ మహల్, రోడ్ రైల్వే హాలిడే హోమ్ దగ్గర అనుమానస్పదంగా కదలికలు ఉన్న నలుగురు ముద్దాయిలను గుర్తించి తిరుపతి అర్బన్ ఇంచార్జి తహశీల్దార్‌కి సమాచారం అందించి, మహిళా పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది సహితముగా వారిని సోదా చేసి వారి వద్ద నుండి 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన తిరుపతి ఈస్ట్ సిఐ మహేశ్వర్ రెడ్డి, ఎస్ఐ పురుషోత్తం రెడ్డి సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ మునిరాజులు, కానిస్టేబుళ్లు జ్యోతినాథ్, రవికుమార్ , చరంజీవి, మణికంతలను జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి అభినందించి రివార్డులను ప్రకటించారని తిరుపతి డిఎస్పి సురేంద్ర రెడ్డి తెలిపారు.

## నడవలూరు ప్రజల ఆధరణ మరువలేనిది..! : పులివర్తి వినీల్



**రామచంద్రాపురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** నడవలూరు ప్రజలు తమపై చూపుతున్న ఆధరణ మరువలేనిదని టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్ అన్నారు. శుక్రవారం నడవలూరు పంచా యతీలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ, మీ ఇంటి వద్దకే మీ పులివర్తి నాని కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీమండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, నాయకులు జనార్ధన్ చౌదరి, నరశింహారెడ్డి, మునిరామిరెడ్డి, గిరిధర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, సాయిప్రసాద్ రెడ్డి, ఉమాపతి నాయుడు, కిషోర్, చైతన్య, నాగరాజు, రమేష్, శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రుయాలో కాంట్రాక్టర్‌పై ధ్వజమెత్తిన కామ్రేడ్లు

**సూపరింటెండెంట్ సానుకూల స్పందన**

**తిరుపతి హెల్త్ , ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** రుయా ఆసుపత్రిలో ఏ వన్ కాంట్రాక్టర్ ఆగడాలు రోజురోజుకీ పెరిగిపోతున్నా యని కార్మికులపై వేధింపులు దాడులు ఎక్కువవుతున్నాయని రుయా అధికారులు మౌనం వీడాలని ఏవన్ కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని సిపిఐ ఏఐటి యుసిల ఆధ్వర్యంలో రుయా పరిపాలన భవనం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డి రవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి ఏఐసియుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి , కె. రాధాకృష్ణ, సిపిఐ నగరకార్యదర్శి జె. విశ్వనాథంలు ముఖ్య అతిధులుగా హాజరై ప్రసంగించారు. రుయా హాస్పిటల్‌లో ఏ వన్ కాంట్రాక్టర్ ఆగడాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని రుయా అధికారులను కాంట్రాక్టర్ శాసిస్తున్నారని కాంట్రాక్టర్ చెప్పినట్లు అధికారులు నడుచుకుంటున్నారని కార్మికులపై చర్యలు జరుగుతున్నా కార్మికులపై వేధింపులు జరుగుతున్నా కార్మికుల పై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నా అధికారులు మౌనంగా ఉన్నారన్నారు. దీంతో కార్మికులకు న్యాయం చేస్తామని కార్మికుల పక్షాన ఉంటామని అధికారులు హామీ ఇవ్వడంతో ధర్నా కార్యక్రమాన్ని విరమించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఆఫీస్ బేరర్స్ సిహెచ్ శివకుమార్, ఎన్ శివ, వైఎస్ మనీ, ఉదయ్ కుమార్, బండి చలపతి, సాయి నగర నాయకులు ఏపీ బాల , బాబు, రవి, ఆర్. బాల రామకృష్ణ, అల్లాబక్షు, మోహన్ రెడ్డి, నాగరాజు ఆర్‌వి రమేష్, సురేష్ వెంకటేష్, సతీష్, పార్వతి, ప్రమీల, మీనా పురుషోత్తం, సునీల్ వరలక్ష్మి, రూప, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

## 14 న అధిక జన మహా సంకల్ప సభ

**తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**

గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్శిటీ మిషన్ కాంపౌండ్‌లో ఈ నెల 14వ తేదీ సాయంత్రం అధిక జన మహా సంకల్ప సభను నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ ఆర్మీ అధ్యక్షుడు డాక్టర్ మురుగేషన్ ప్రభు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో ఆఫీసర్‌గా పనిచేసిన డాక్టర్ విజయకుమార్ సారథ్యంలో ఈ మహాసభ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. 2023 జూలై నెలలో తెలుగు జిల్లా ఏపీలోని తడలో ఈ సంకల్ప యాత్ర ప్రారంభమైందని 2024 ఫిబ్రవరి రెండో తారీఖున తూర్పు గోదావరి జిల్లాలో ఈ యాత్ర ముగిసిందన్నారు. కులాలకతీతంగా పేదరిక నిర్మూలన కోసమే.. ఈ యాత్ర కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ యాత్ర రాష్ట్రంలో 12 జిల్లాలలో, 67 నియోజకవర్గాలులోని 2500 గ్రామాలను సందర్శించిందని అన్నారు. విజయ్ కుమార్ సమాజంలో పేదరికం పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ముందుకు నడుస్తున్నారన్నారు. అధిక జన మహా సంకల్ప సభను పేద ప్రజలందరూ జయప్రదం చేయడానికి తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో పరమేశ్, మురళి, నాగరాజ్, విష్ణు, అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.

## బహుజనుల ఆర్థికాభివృద్ధి కోసం ఏకమవుదాం



**తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** సమాజంలో విద్య, వైద్య, ఆర్థిక ఉపాధి రంగాలలో అభివృద్ధి సాధించాలంటే బహుజనలందరూ ఏకం అవ్వాలని దళిత సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన హక్కుల సాధన కోసం మనమందరం ఏకమవ్వాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేరుతో మనల్ని అణగ తొక్కుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. పేరుకే ఇంగ్లీష్ మీడియం పాఠశాలలని అక్కడ బోధించడానికి టీచర్లు కరువయ్యారన్నారు. ప్రతి జిల్లాలో బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలన్నారు. ఇంటి స్థలాలకు ఐదు లక్షల వరకు మార్కెట్ రేటు కల్పించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను, ఎస్సీ, ఎస్టీ వ్యక్తిగత జనాలకు ఖర్చు చేయాలన్నారు. ప్రతి జిల్లాలో తోలు పరిశ్రమలు నిర్మించాలన్నారు. వైస్ ప్రెసిడెంట్ బాబు, ప్రసాదు, జశ్వంత్, ముని తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ మృతికి టాస్క్‌ఫోర్సు ఘనంగా నివాళి



**తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** అన్నమయ్య జిల్లా కేవీపల్లి వద్ద ఎర్రచందనం స్మగ్లర్ల కారు ఢీకొని మరణించిన కానిస్టేబుల్ గణేష్ (32) మృతికి శుక్రవారం టాస్క్‌ఫోర్సు అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులు అర్పించారు. తిరుపతి టాస్క్‌ఫోర్సుతో పాటు రైల్వే కోడూరు, కడప సబ్ డివిజన్ల నుంచి సిబ్బంది కపిలతీర్థం సమీపంలోని కార్యాయలంలో ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్సు కార్యాలయంలోని ఒక సమావేశ మందిరంగా నామకరణం చేస్తామని తెలిపారు. సిబ్బందికి వ్యక్తిగత రక్షణకు తీసుకోవాల్సిన అంశాలపై వివిధ శాఖల నుంచి శిక్షణ ఇప్పించడానికి చర్యలు తతీసుకుంటున్నట్లు తెలిపారు. గణేష్ కుటుంబానికి తగిన సహాయ సహకారాలను అందజేస్తామని అన్నారు. ఆర్ధిక పరంగా ఆయనకు రావాల్సిన పరిహారాలను త్వరతిగతిన అందజేయడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. గణేష్ మరణానికి కారకులను పట్టుకుని, వారికి శిక్ష పడేలా చేయడం ఆయనకు సమర్పించే నిజమైన నివాళి అవుతుందని తెలిపారు. డిఎస్పి చెంచుబాబు మాట్లాడుతూ టాస్క్‌ఫోర్సు చరిత్రలో ఇలాంటి సంఘటన తొలిసారిగా జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు శ్రీనివాసులు, సురేష్ కకుమార్, ఆర్ఐలు కృపానంద, చిరంజీవులు, ఏసీఎఫ్ శ్రీనివాస్, ఎఫ్ఆర్ఓ మురళీకృష్ణ, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. గణేస్ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ పలువురు సహోద్యోగులు కన్నీటి పర్యంతం అయ్యారు. సంతానం సూచికంగా 2 నిమిషాలు మౌనం పాటించారు.

## జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీ షా**



**తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీ షా తెలిపారు. శుక్రవారం స్థానిక బైరాగపట్టెడ ఎంజిఎం హై స్కూల్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పాఠశాల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు పెద్ద చదువులు చదువుకొని మంచి స్థాయికి రావాలంటే ఆరోగ్యం కూడా చాలా అవసరం అని అన్నారు. రోగనిరోధక శక్తితో నులిపురుగుల భారిన పడకుండా శారీరక, మానసిక ఆరోగ్యం పిల్లలకు అవసరం అన్నారు. నులిపురుగులు పిల్లల ఎదుగుదల మీద తీవ్రమైన ప్రభావం చూపుతాయని దీనివల్ల పోషకాహారం లోపం ఏర్పడుతుందని అంతే కాకుండా రక్తహీనత, ఆకలి లేకపోవడం, అలసట, కడుపునొప్పి, వికారం విరోచనాలు, బరువు తగడం వంటి పరిస్థితులను పిల్లలకు దూరం చేసి నులిపురుగులను నిర్మూలించి మంచి ఆరోగ్యంగా ఉండేందుకు ఆల్బెండజోల్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. 1 నుండి 19 సంవత్సరాల పిల్లలు, కిశోర బాలికలకు 400 ఎంజి మాత్రలు 1 నుండి 2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర భోజనం చేసిన తరువాత మింగించాలని తెలిపారు. జిల్లాలో అంగన్‌వాడి కేంద్రాల పిల్లలు 97481, ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల విద్యార్థులు 305915 మంది. ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్మీడియట్ విద్యార్థులు 72722 మంది, బడి బయట పిల్లలు 2969 మంది మొత్తం 479087 పిల్లలు ఉన్నారని వాళ్ళందరికీ డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు.

## ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయండి

**ఏర్పేడు, ఫిబ్రవరి9, ప్రభాతవార్త;** వైసిపి గత ఐదేళ్లుగా నియోజకవర్గానికి చేసిన సేవలను గుర్తించుకొని వైసిపి ప్రభుత్వం గుర్తైన ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తనయ బియ్యపు పవిత్రరెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని కుక్కలగుంట గ్రామంలోని పాయిల్ సెంటర్ గ్రామంలో ఎన్నికలకు సిద్ధం ప్రచారంలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఈసారి మళ్లీ తన తండ్రి బియ్యపుమధుసూదన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఏర్పేడు మండల ఇన్‌చార్జి కిషోర్ కుమార్ రెడ్డి, సర్పంచి మోహనప్రియ, అధ్యక్షురాలు సురేఖ, మాజీ ఎంపీటీసి మునిరత్నంరెడ్డి, గుణశేఖర్‌నాయుడు, కరీముల్లా, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



## వన్నెకుల జైత్రయాత్ర సభను జయద్రపం చేయండి

**-ఎంఎల్‌సి డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం**

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** ఈనెల 11వతేదీన పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ఉనన శివం కళ్యాణమండపంలో నిర్వహించనున్న వన్నెకులక్షత్రియుల జైత్రయాత్ర మహాసభను జయప్రదం చేయాలని రష్ అధినేత ఎంఎల్‌సి డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన వన్నెకుల క్షత్రియ జైత్రయాత్ర మహాసభ జరిగే శివం కళ్యాణ మండపాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధిక జనాభా వన్నెరెడ్లు ఉన్నారని గుర్తుచేశారు. పల్లవరాజ వంశానికి చెందిన వన్నెరెడ్ల ధైర్యానికి, సాహసానికి ప్రతీకలని చెప్పారు. అలాంటి వన్నెరెడ్లు ఒకేతాటిపై చేరి ఐక్యతా, చైతన్యరాగం పాడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో తన సత్తా చాటేందుకు ఎన్నడూ ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి, స్వామిరెడ్డిభరత్‌రెడ్డి, మురళీరెడ్డి, మధురెడ్డి, దాముర‌ెడ్డి, జగదీష్ రెడ్డి, డాక్టర్ బాబు పాల్గొన్నారు.

## బాలికల గురుకులం ప్రవేశపరీక్షకు దరఖాస్తులు ఆహ్వానం

**సత్యవేడు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** 2024-25 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియ ట్ మొదటి సంవత్సరంలో బాలికల గురుకులంలో చేరదలచిన విద్యార్థినులు ఈనెల 23 లోగా ఆన్‌లైన్‌లో ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని సత్యవేడు అంబేద్కర్ బాలికలగురు కులంప్రిన్సి పాల్‌ప్రసూనకోరారు. గురుకులంప్రవేశపరీక్షకు సంబం ధించి ఆమె శుక్రవారం ప్రకటన వెలువరించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవ త్సరంలో ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసే విద్యార్థినీలు వయస్సు 31.08.2024 నాటికి 17సం॥లు మించి ఉండరాదన్నారు.

## పద్మావతీ అమ్మవారికి ఘనంగా ఊంజల్‌సేవ

**నారాయణవనం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** నారాయణవనం కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవా రం భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం పాలు, పెరుగు, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అధిరోహించి ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు.

## ఆలయాల్లో ఘనంగా అమావాస్య పూజలు

**నారాయణవనం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** వెంకటకృష్ణాపాలెం పంచాయతీ పరిధి నాగిలేరు శింగిరికోన లో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో అమావాస్య పూజలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేసారు. అలాగే నారాయణవనంలో అవదూతగా వెలసిన తాతాసొరకాయులస్వామి ఆలయంలోను అమావాస్య పూజలను ఘనంగా జరిపారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నదాన ం నిర్వహించారు.

## ఈనెల 13న మండల సర్వసభ్య సమావేశం

**నారాయణవనం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** ఈ నెల 13వ తేది మంగళవారం ఉదయం 10గంటలకు మండల సర్వసభ్య సాదారణసమావేశంజరుగుతుందని ఎంపిడిఓకృష్ణమూర్తితెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులందరు పాల్గొనాలని కోరారు.

## అమ్మవారి భక్తులకు "జల్లా వారి" అన్నదానం



**చంద్రగిరి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో శుక్రవారం చంద్రగిరి భారతీనగర్‌కు చెందిన దివంగత జల్లా గంగిరెడ్డి జ్ఞాపకార్థం భార్య జల్లా నాగమ్మ, కుమారులు జల్లా సుబ్రమణ్యం రెడ్డి, జల్లా కృష్ణమూర్తి రెడ్డి, జల్లాజనార్ధన్ రెడ్డి, కుమార్తె అత్తూరు సుజాత అమ్మవారి భక్తులకు అన్న దానం చేశారు. అమ్మవారి ఆలయంలో ప్రతి శుక్రవారం భక్తులకు దాతల ద్వారా అన్నదాన విధానాన్ని ఏర్పాటు చేయడం మంచిదన్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఆకలి తీర్చడం తమకు సంతృప్తిని కలిగించిందన్నారు. ఈ సందర్భంగా ఆలయచైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి దాతలకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు జల్లా జ్యోతి, జల్లా సునంద, జల్లా లక్ష్మి, అత్తూరు వెంకటేష్, జల్లా దుర్గా ప్రసాద్, జల్లా తరుణ్ పాల్గొన్నారు.

## ఊంజల్‌పై సేదదీరిన "శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు"



**చంద్రగిరి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రవణ నక్షత్రంనుపురస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఊంజల్‌పై సేదదీరారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాతసేవతోమేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంక ర్యాలను ఆగమోక్తంగా నిర్వహిం చారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూ ర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించగా ఊంజల్‌పైసేదదీరారు. ఈ కార్యక్రమం లో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, మోహన్ నాయుడు, ఆలయ అర్చకులు కళ్యాణ సుందర్, అధ్యాపక సంతాన కృష్ణన్, పరిచారిక నల్లూరి విష్ణుమూర్తి, జమేదర్ మంకు చిరంజీవి, పాల్గొన్నారు.

## మద్యం అక్రమ రవాణా చేస్తున్న యువకుడు అరెస్టు

**న 15 మద్యం సీసాలు స్వాధీనం**



**రేణిగుంట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** అక్రమంగా మద్యం సీసాలను తరలిస్తున్న పీలేరుకు చెందిన సుకుమార్(47)ను రేణిగుంట జీఆర్పీ ఎస్ఐ రవి తమ సిబ్బందితో అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 15 మద్యం సీసాలను(750 ఎంఎల్) స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రవి కథనం మేరకు... సుకుమార్ పాండిచ్చేరిలో 15 మద్యం సీసాలను కొనుగోలు చేసి వాటిని చెన్నైకి తీసుకొచ్చి, అక్కడి నుంచి ఎగ్మోర్ కాచిగూడ రైలులో రేణిగుంటకుచేరుకున్నాడు. పీలేరురోడ్డు మార్గంలో తీసుకెళ్లే ప్రయత్నంలో ఉండగా రైల్వే ఎస్ఐ రవి ఆధ్వర్యంలో రైల్వే పోలీసులు ఆకస్మికంగా చేస్తున్న తనిఖీల్లో అతని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద స్వాధీనం చేసుకున్న 15 మద్యం సీసాల విలువ 4344 రూపాయలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. రైళ్లలో అక్రమంగా మద్యాన్ని తరలించడం నేరమని ఆయన తెలిపారు.

## పని మనిషిగా పనిచేస్తాం..!

పిసిసి ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు పని మనిషిగా పనిచేస్తామని పిసిసి ఉపాధ్యక్షుడు చింతగుంట వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాయలచెరువు కట్ట సమీపంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూకివాకం ఓం ప్రకాష్ రెడ్డి ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా చిట్టత్తూరు గ్రామానికి చెందిన బాలచంద్రను ఆయన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిం చారు. అనంత రం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు నాయకులు వారధిగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కెవిఎస్ వాసు, తదితరులు పాల్గొన్నారు.


**సప్తగిరి గ్రామీణ బ్యాంక్**
(ప్రభుత్వరంగ సంస్థ : ఇండియన్ బ్యాంక్‌చే వ్యవస్థాపితం)
కొర్లగుంట శాఖ, తిరుపతి. ఫోన్ : 0877-2281017

**బంగారు నగల వేలం ప్రకటన**

దిగువ కనబరిచిన వ్యక్తి బంగారు నగలపై అప్పులు తీసుకుని తిరిగి చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం **తేది.28-02-2024, (బుధవారం) మ.3.00 గం.లకు బ్యాంకు ఆవరణలో వేలం** వేయబడును. **షరతులు :** 1. నోటీసులు చేరనివారు ఇదే ఆఖరి నోటీసుగా భావించవలెను. 2. ఈ ప్రకటన ఖర్చు అప్పుదారుడే భరించవలెను. 3. ఎటువంటి కారణము తెలుపకనే వేలం వాయిదా / రద్దు చేయుటకు బ్యాంకు వారికి సర్వ హక్కులు కలవు. 4. వేలంలో పాల్గొనువారు రూ.10,000/- ధరావతు చెల్లించవలెను.

| లోన్ అకౌంట్ నెం. | అప్పుదారుని పేరు, తండ్రి / భర్త : పేరు మరియు చిరునామా | బంగారం గ్రా.లలో |
|---|---|---|
| 50047130580 | కె.భాగ్యలక్ష్మి, భర్త : కె.చంద్రశేఖర్, 13-7-914/జి, కొర్లగుంట, తిరుపతి | 72.50 |

సం/-బ్రాంచ్ మేనేజర్, కొర్లగుంట శాఖ



**తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి**

ఫైలు సంఖ్య 1567/జి1/2023 తేది: 09.02.2024

**ముసాయిదా ప్రకటన**

ఆంధ్ర రాష్ట్ర మహానగర ప్రాంతము మరియు పట్టణాభివృద్ధి సంస్థ ప్రాంతము అభివృద్ధి చట్టము, 2016, ఉప-చట్టము 15 ప్రకారం ఈ క్రింద తెలిపిన భూవినియోగ మార్పు, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ప్రాంతమునకు ప్ర.ఉ. సంఖ్య 112, పు.ప.శాఖా, తేది: 08.03.2019ననుసరించి ప్రతిపాదించడమైనది. ఈ ముసాయిదా ప్రకటన వెలువడిన 15 (పదిహైదు రోజుల లోపల) ఈ క్రింద తెలిపిన భూవినియోగ మార్పు వలన, వ్యక్తులు లేదా సంస్థలకు అభ్యంతరములు లేదా సలహాలను ఉపాధ్యక్షులు, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి -517501 వారికి వ్రాతపూర్వకముగా తెలిపిన , విషయములను, ముఖ్యకార్యదర్శి, పురపాలక పరిపాలనా మరియు పట్టణాభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము సచివాలయము, వెలగపూడి, గుంటూరు వారికి, వారి పరిశీలన మరియు తగుచర్యలు నిమిత్తము పంపబడునని తెలియజేయడమైనది.

**భూ వినియోగ మార్పు ముసాయిదా ప్రకటన**

ప్ర.ఉ. సంఖ్య.112, పు.పా.శాఖా, తేది: 08.03.2019,నందు బృహత్ ప్రణాళికా యందు తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ భూవినియోగ ఆమోదము పొందిన ప్లాను నందు వడమాలపేట మండలములోని పాదిరేడు అరణ్యం గ్రామములో సర్వేనెంబరు 42, 43, 45, 46, 47, 48, 49, 50, 51, 52, 53, 56, 57, 58, 59, 60, 62, 63, 64, 65(P), 66, 67(P), 68, 69, 70, 71(P), 72, 73, 74, 75, 76, 77(P), 78, 79, 80, 81, 82, 83, 84, 85, 86, 87, 88, 97, 98, 99, 100(P), 101, 102, 103, 104, 105, 106, 107, 108, 109, 110, 111, 112, 113, 114, 115, 116, 117, 118, 119, 120, 121, 122, 123, 124, 125, 126, 127, 128, 129, 130 and 131, లో 417 ఎకరములు 16 సెంట్లు విస్తీర్ణము వ్యవసాయ భూమి మరియు ప్రతిపాదిత 60 మీటర్ల మాస్టర్‌ప్లాన్ రోడ్డు గా వున్నది. సదరు స్థలమును వ్యవసాయ భూమి నుండి నివాస ఉపయోగమునకు మరియు ప్రతిపాదిత 60 మీటర్ల మాస్టర్ ప్లాన్ రోడ్డు రద్దు చేయుటకు, సవరించిన మాస్టర్ ప్లాను యం.యం.పి. సంఖ్య 01/2024 తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా ప్రతిపాదించడమైనది. సదరు ముసాయిదా భూ వినియోగ్య మార్పు ప్లాను సంఖ్య 01/2024, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి కార్యాలయములో పనిదినముల వేళయందు ప్రజలు సందర్శించి పరిశీలించుటకు ఏర్పాటు చేయడమైనది.

**భూ వినియోగమార్పు భూమి హద్దులు "A,B,C,D,E,F,G,H,I,J,K,L,M, N,O,P,Q,R, S,T,U,V,W,X,Y - A" -**

గ్రామలెక్కధాఖల ప్రతిపాదిత భూమి

ఉత్తరము: : ఖాళీ భూమి మరియు యల్.యం.కండ్రిగ గ్రామము
దక్షిణం : సదాశివ కోనకు పోవు రహదారి
తూర్పు : రిజర్వు అరణ్యము
పడమర : 200 అ. తిరుపతి నుండి చెన్నై పోవు జాతీయ రహదారి మరియు ఖాళీ భూమి

// ముసాయిదా ఆమోద నిమిత్తము//

సం/- ఉపాధ్యక్షులు,
తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి

